కావేరి

'గిరి'

౧

కృష్ణారావు మొగవాడవటంచేత, యెండలో తిరగడంచేత ఆయనసౌందర్యం చప్పున అగుపడదుగాని ఆయనకూతురు రాజ్యలక్ష్మి చాలాచక్కంది అని చూడటంతోటే తెలుస్తుంది. రాజ్యలక్ష్మి చెక్కిన చందనపుబొమ్మలాగు పొడుగ్గా, తీర్పుగా వుంటుంది. చక్కని ముక్కు, సన్నని పెదిమలు, విశాలమైన కళ్లు, పల్చని చెంపలు, జామపండులాంటి దేహం యెంతో అందం కూరుస్తాయి ఆమెకి. ఆమెశరీరం చాలా సన్నదైనా తగినంత సుంద్రంగా నిండుగావుండి నాజూగ్గా ఆకర్షిస్తుంది. లోఃగ్రసీసాకిచుట్టిన కాగితంమల్లే ఆచీరని అర్థాన్నంగా అరవాళ్ల మాదిరి చుట్టక సింపిల్‌గా ఆంగ్రులకట్టు కట్టి మొండిచేతుల రవికెను తొడిగి కాళ్లకి చెప్పులువేస్తే, సౌందర్యమంతా పాశ్చాత్య స్త్రీలల్లోనే వుందనుకునే నవీనయువకులుగూడా ముగ్ధులౌతారు.

అయినా, పాపం, కృష్ణారావుఛాందసంవల్ల రాజ్యలక్ష్మికి రూపానికితగిన విద్యా సంస్కారాలు లేవు. సంఘానుగ్రహంవల్ల ఆమె యవ్వనానికి తగిన వుపయోగం లేదు.

కృష్ణారావుకి శివసముద్రం మార్పుఅయినాక ఆ కొత్తవూరికి ఆడవాళ్లని తీసికెళ్లక తానొక్కడే వెళ్లాడు. వొకనెలతరువాత వాళ్లని రమ్మని రాశాడు. కృష్ణారావుభార్య పద్మమ్మ, రాజ్యలక్ష్మి యిద్దరూ ఆడవాళ్లవటంచేత వెంటరావటానికి మొగాళ్లెవరూ లేకుండడంచేత వాళ్లొచ్చేబండికి మద్దూరుస్టేషనుకి యెవరినయినా పంపిస్తాననికూడా రాశాడు. ఆవాళ మధ్యాన్నం మూడుగంటలకి బండి మద్దూరులో ఆగేవరకు పందొమ్మిది యిరవైయేళ్ల కుఱ్ఱవొహడు వాళ్లున్న పెట్టెవేపు పరుగెత్తుకొచ్చి, తలుపుతెరిచి, తనపేరు గోపీనాథు అనీ, బళ్లపులో మెకానిజం నేర్చుకుంటున్నాననీ, కన్నడంవాళ్లనీ, కృష్ణారావు తమని తీసుకోరావటానికి తన్ను పంపాడనీ, అన్నీ వొక్కటేవూపిరిలో అనేస్తో చెక్కపైనుంచి సామానునుదింపాడు. సామాను దింపుతోనే పోర్టర్ని కేకేసి బేరమేమీ లేకుండా వాడికందించాడు. ఇదంతా చూస్తోనుంచున్న రాజ్యలక్ష్మి, పద్మమ్మ చకితులైపోయారు. ఆ హడావుడి, చురుకుదనానికి తోడు అతని గట్టిశరీరం, సన్నని వొచ్చీరాని మీసం, హెరల్లాయిడ్ అద్దాలు, వూదాకోటు, తెల్లని లుంగీ, రాజ్యలక్ష్మిని మరీముగ్ధురాలిని చేశాయి. పక్కనేనుంచున్న అరవాళ్ల పిల్లొకామె నోరు తెరిచి అతనికేసి చూస్తోంటే వాళ్ల అత్త కమిలిపోయేటట్టు బుగ్గకొండి, "వాడెంట పోరాదూ" అంది.

బస్సుదగ్గిరకూడా అదే హడావుడి గోపీనాథుది. అందరితో గబాగబా మాట్లాడేస్తోన్నాడు కన్నడంలో, యింగ్లీషులో, హిందూస్తానీలో. వీళ్లిద్దరికీ మంచిస్థలం చూపించాడు కండక్టరు. రాజ్యలక్ష్మివెనకసీటులో కూచున్నాడు గోపీనాథు. ఆస్థలం వీళ్లకివ్వడం తక్కిన ప్రయాణీకులు కాస్త వోర్వలేక గొణిగితే కండక్టరు, గోపీనాథు వాళ్లని దబాయించారు కన్నడంలో. "కృష్ణారావు", "వోవరుసీరు" అనే ముక్కలు మాత్రం అర్థమయాయి రాజ్యలక్ష్మికి.

బస్సు వూరుదాటింది. అందాకా గోపీనాథుకేసి పిచ్చిగా చూస్తోన్న పద్మమ్మకి అప్పుడు కాస్త వూపిరి ఆడినట్టుంది. నెమ్మదిగా, "నీ పేరేమిటి నాయనా!" అని అడిగింది యిదివరకే ఆతను చెప్పాడన్న విషయం మరిచి, 'అయ్యో! నాకొకొడుకు యిట్లాంటివాడు లేకపోయెనే' అనే ముఖంతో.

"గోపీనాథుఅండి."

కాస్తసేపు ఆగి, "ఎన్ని గంటలకి చేర్తాం ఆ వూరికి?"

"అయితే మీరెప్పుడూ యీవూరు రాలేదన్నమాట!"

"లేదు, యిదే మొదటితడవు."

ఇహ తరుణం దొరికిం దాతనికి. కావేరి నది పుట్టుపూర్వ్వందగ్గరనుంచి శివసముద్రంలో పవరుహౌసు స్థాపితం అయ్యేవరకు జరిగిన చరిత్రంతా చెప్పాడు ముందు రాజ్యలక్ష్మిభుజంమీదికి వొరిగి. వాళ్లే కాక బస్సులోని ముందుభాగంలోనివాళ్లంతా చకితులయి పోయారు. పద్మమ్మ రాజ్యలక్ష్మివేపై, "చూడమ్మాయి, మనం యిన్నాళ్లనుంచీ మనవూళ్లో వున్నా అక్కడి మంచినీళ్ల భావి కొట్టించిం దెవరో మనకి తెలీదు. ఈతనికి యింత చిన్న యీడులో యిన్ని విషయాలు యెట్లా తెలుసో!" కళ్లలో నీళ్లుపెట్టుకొని, "నువ్వు దురదృష్టపు ముండవికాబట్టి యిరవై యేళ్లలోపలే యీవేషం వొచ్చింది కాని ఆఅబ్బాయికూడా యెంత పెద్ద చదువు చదివాడని! ఆపాడుదైవం......" పైటలో ముక్కు చీదింది. బస్సులోనివాళ్లంతా మెచ్చుకోటంతోటే గోపీనాథు జేబులోంచి సిగరెట్టుతీసి వెలిగించాడు.

వొహచిన్నవూళ్లో బస్సు ఆగింది. అక్కడ అర్థ గంట ఆపతుంది. చాలామంది దిగి అక్కడ వున్న చిన్నహోటలులో దూరారు. గోపీనాథు కూడా వెళ్లి రెండుకప్పులకాఫీ పట్టుకొవచ్చి బస్సులో కూచున్న రాజ్యలక్ష్మికి యిచ్చాడు. ఆమె వొద్దంది. బలవంత పెట్టాడు. "తీసుకో అమ్మాయి, ఆతను అంత బలవంత పెడుతుంటేనూ." అంది పద్మమ్మ. రాజ్యలక్ష్మి ఆశ్చర్యంగా గోపీనాథుకు కనబడకుండా అంది: "బస్సులో తురకవాళ్లుకూడా వున్నారు. ఆముట్టుడైన కాఫీ యెట్లా తాగను?"

"పరవాలేదులే. యీవొక్కపూటకి. ఇక్కడ మనని యెరిగినవాళ్లెవరూ లేరులే."

రాజ్యలక్ష్మి తీసుకుంది. ఆమెకూడా అతని మనుసు చిన్నపుచ్చటం బాగనిపించలేదు.

అక్కడినుంచి బయల్దేరింతరువాత బస్సు జువ్వుమని గాలిలా పరుగెత్తడం ఆరంభించింది. ప్రయాణీకులంతా వుత్సాహంతో దమ్ముబిగబట్టి కూచున్నారు. డ్రైవరు 'చూడు నాప్రతాపం' అన్నట్టు టోపీతీసి ఆ పొడుగాటి వెంట్రుకల్ని గాలికి వొదిలి, సిగరెట్టు పెదిమెలమధ్య యిరికించుకొని, ఆపొగకు కుడికన్ను కాస్తమూసి రుయ్యిన తోల్తోన్నాడు, సారథ్యంలో రికార్డు బ్రేకుచేసిన మాతలినికూడావోడకొడ్తానన్నట్టు. వొహతడవ రాజ్యలక్ష్మి వెనక్కి తిరిగిచూస్తే ఆమె పైటంతా ఆతీవ్రమైనగాలికి గోపీనాథు వొళ్లో కొట్టుకుంటుంది. చప్పున దాన్ని లాక్కొని ముదురుక్కుంది. "ఫరవాలేదులెండీ" అన్నాడు గోపీనాథు.

దాదాపు ఆరుగంటలకి మెలికలుతిరిగిన రోడ్డు గుండా, యెఱ్ఱనినీళ్లతో నిండుగాపారే యెన్నో కాలవల్ని దాటేస్తో, అప్పుడప్పుడే వూళ్లోకి పోతూన్న పశువుల్ని బెదరగొడ్తో, బస్సు శివసముద్రం చేరింది.

అతిమనోహరమైన ఆప్రదేశం రాజ్యలక్ష్మికి నోటమాటపెకలకుండా చేసింది. పవరుహౌసుకోసం ప్రత్యేకంగా తీసిన ఆపెద్దకాలవ, దానిమీద మాటిమాటికి చిన్నచిన్నవంతెనలు, కాలవకి రెండువేపులా చక్కనిరోడ్లు, వాటి యిరుప్రక్కల అందమైన పెద్ద చెట్లు, దీపావళినాటిమల్లే వెలుగుతోన్న దీపాలు ఎంతో మనోరంజకంగా తోచాయి ఆమెకి.

కృష్ణారావున్న యిల్లు కూడా చాలా అందమైంది. అది యింత అందంగా వుంటుం దనుకోలేదు రాజ్యలక్ష్మి. వోవరుసీర్లు వుండే యిళ్లు, దాంట్లో ప్రకృతిసౌందర్యానికి విముఖులైన కృష్ణారావువంటి వాళ్ల యిళ్లు యెంత శుభ్రంగా, యెంత అందంగా వుంటాయో ఆమెకి తెలుసు.

౨

"రాజ్యం!" కృష్ణారావు పిలిచాడు బైటివసారాలోంచి. కాఫీగ్లాసు కిందపెట్టి రాజ్యం వెళ్లింది.

"వుంకోగ్లాసులో కాఫీ పట్టుకురా ఈయనకి."

కృష్ణారావుటేబిలుముందు కుర్చీలో కూచున్నాడు గోపీనాథు. ఏం అమాయకత్వం! ఎంతవినయం! మాటలైనా వొస్తాయా పాపం అన్నట్టు కూచున్నాడు.

రాజ్యలక్ష్మీవేపు కళ్లయినా యెత్తలేదు. కాని కళ్లెత్తకుండానే చూశాడు.

రాజ్యం లోపలికి వొచ్చేవరకే కృష్ణారావు మాటల్ని విన్న పద్మమ్మముఖం చిట్లించింది. "అయిపోయిందని చెప్పకపోయావా మళ్లీ యెవరు చేస్తారిప్పుడు." అంది.

"ఆయనముందు యెలా చెప్పనమ్మా?"

"ఎవరాయన?"

"నిన్న మనని స్టేషనునుంచి తీసుకురాలేదూ, ఆయన."

చప్పున పద్మమ్మబొమలు ముడివిడాయి. ముఖం చాటంత అయింది. "తీసికెళ్లు, నాకాఫీ తీసికెళ్లి యివ్వు."

"నీముందుది తీసికెళ్లటం యెందుకు? నువ్వు తాగెయ్యి వొక్క నిమిషంలో చేసి తీసికెడ్తా."

"ఫరవాలేదు తీసికెడ్దూ." బలవంతంగా కాఫీగ్లాసు చేతులో పెట్టి ఆమెని బైటికి తట్టింది.

కాఫీ టేబిలుమీద పెట్టి వెడ్తోంటే కృష్ణారావు అన్నాడు, "చూడు రాజ్యం, అమ్మని కనుక్కో, బ్లవుచూడ్డానికి వెడ్తారేమో. వెళ్లేట్టయితే వెళ్లండి గోపీనాథుతీసికెడ్తాడు."

రాజ్యం లోపలికెళ్లి కనుక్కుంది. వెడ్దామంది పద్మమ్మ. ఇద్దరూ సిద్ధమయారు. వసారాలోకి ముందు పద్మమ్మ వొచ్చింది. గోపీనాథు గోడవేపు ముఖమై నుంచొని అక్కడవున్న రాజ్యంఫోటోని చూస్తోన్నాడు. అప్పుడే గడెవిప్పి తొడుక్కున్న ఆతని సిల్కుకోటు, కష్టపడితీసిన సన్నని పాపెట, నూనెతో శ్రద్ధగా దువ్విన వెండ్రుకలు ఆమెదృష్టిని ఆకర్షించాయి. చప్పున వెనక్కి తిరిగి ఆతనికి వినపడకుండా రాజ్యంతో, "ఆముఖం కాస్త సబ్బుతో కడిగి పెట్టెలోనిచీర కట్టుకోకూడదమా? వీళ్లు వోవరుసీరువాళ్లంటే, మనకేం, ఆయనకి అగౌరవం."



"ఆముఖం కాస్త సబ్బుతోకడిగి...ఆయనకి అగౌరవం."

రాజ్యానికి యేమీ వుత్సాహంలేదు. ఆహృదయంలో వొకవిధమైన ఆందోళన, భయం — ఆమెకి అర్థంకాని భయం. మనసు యెక్కడోవుంది ఆమెకి తెలీనిచోట. తల్లి కడుక్కుంటే తానూ కడుక్కుంది ముఖం. ఆమె పెట్టెలోంచి సిల్కుచీరని తీసి కట్టుకుంది. రాజ్యానికి తెల్లచీర తీసియిచ్చింది.

వాళ్లు వీథిలో కాలుపెట్టినప్పటినుంచి మళ్లీ గోపీనాథుది అదేధోరణి. ఆరోడ్డుపక్క యిళ్లల్లో వుండేదెవరో, వాళ్లక్కడికి వొచ్చి యెన్నాళ్లయిందో, యెక్కడినుంచి వొచ్చారో చెప్పడం ఆరంభించాడు. "తొమ్మిదిగంటలవుతోన్నా యింకా రోడ్లో దీపాలు వెలుగుతోన్నాయేం?" అని పద్మమ్మ విచారించడమే తడవు, అక్కడి యెలక్ట్రిక్కుకి కర్చేమీకాదని

మొదలుపెట్టి మైసూరుస్టేటుకి యెలక్ట్రిక్కువల్ల వొచ్చే లాభనష్టాలలెక్కంతా వినిపించాడు. ఎడమవేపుకి అన్నిటికన్నా అందమైన వొహచిన్నయింటిలోకి తోవతీశాడు. "ఇదేనా బ్లఫు" అని పద్మమ్మఅడిగితే, "కాదిది మా క్లబ్బు" అన్నాడు. పద్మమ్మ మెట్టు మీదినుంచి కాలు వెనక్కి తీసింది. "క్లబ్బులోకి వెళ్లటమే! వొద్దు. ఎవరన్నా చూస్తే యేమంటారు!"

"పరవాలేదండీ, యెవరూలేరు లోపల." అన్నాడు లోపలికి తొంగిచూసి. రాజ్యంవేపు చూసింది పద్మమ్మ. రాజ్యంముఖంలో యేమీ జవాబు దొరకలేదు. నాలుగువేపులా చూసి మెట్లెక్కింది. లోపల యెంతోశుభ్రంగా వుంది. ఆ మెరిసేకుర్చీలూ, బల్లలూ, వాటిమీద అందమైన బొమ్మలపత్రికలూ, యెంతో ఆకర్షణీయంగావున్నాయి. ఆకుర్చీలమీద కూచొని ఆపత్రికల్ని చదువుతాడుగావును గోపీనాథు! "నువ్వు యిక్కడే చదువుతోంటావా?" అని అడిగింది పద్మమ్మ ఆశ్చర్యంగా. "అవునండీ" అని చిరునవ్వుతో జవాబుచెప్పాడు గోపీనాథు యిదేం మహాభాగ్యమా అన్నట్టు. లోపలిగదిలోకి తీసికెళ్లి బిలియర్డ్సు టేబిలు చూపించాడు. ఆ టేబిల్ని చూడటం వాళ్లకిదే మొదటితడవు. అంత పెద్దటేబిలు, భరువైంది, దాంట్లోని పచ్చ మహామల్ పద్మమ్మకళ్లని తిప్పేసాయి. మూలకున్న పొడుగాటికఱ్ఱ వొహటి తీసుకొని ఆడేవిధం చూపించాడు. ఆయెఱ్ఱని బంతి నిమ్మళంగా, రాజులాగా దొల్లిపోతోంటే యేమిటో యెట్లాగో అనిపించింది పద్మమ్మకి. తనవేళ్లతో తాకీతాకనట్టు దాన్ని ముట్టుకుంది. గోపీనాథు దాన్ని తీసి, "చూడండీ. యెంతనున్నగా వుందో," అని రాజ్యంచేతులో పెట్టబోయాడు. రాజ్యం వెనక్కిలాక్కుంది చేతిని. ఆతను బలవంతంగా ఆమెచేతిని పట్టుకొని బంతిని పెట్టాడు. "చూడమ్మాయి, చూడు; యెంత నున్నగావుందో"అంది పద్మమ్మ. ఆతని బలువైన చేతుల్లో రాజ్యం మృదువైనచెయ్యి వొణికింది. పావురంలా కొట్టుకుంది. ఆతను ఆమె కళ్లల్లోకి చూశాడు. ఆమె ఆబంతిని కిందపడేసింది.

గోడలకివున్న ఫోటోలు చూపించాడు. క్లబ్బువాళ్లంతాకలిసి వివిధసందర్భాల్లో తీయించుకున్న ఫోటోలవి. వాటిలో చాలావాటిలో గోపీనాథు వున్నాడు. వొహదాంట్లో యూరోపియను ఆఫీసరు వెనకాలనుంచున్నాడు. ఆఆఫీసర్ని తనవేలుతో చూపిస్తో గోపీనాథు అన్నాడు, "ఈయన యిక్కడి గొప్పఅధికారి. రెండువేలు జీతం. నాబిలియర్డ్సుఆటనిచాలా మెచ్చుకున్నాడు." పద్మమ్మ ముఖం తేలేసింది. నిర్ఘాంతపోయింది యెంత గొప్పవాడు గోపీనాథుఅన్నట్టు.

బ్లఫులో మిషనులన్నీ తిరుగుతోండడంచేత చెవులు గడలుపడేట్టు చప్పుడు. వేరేచప్పుడేమీ వినపడదు. గోపీనాథు రాజ్యంచెవికి దగ్గిరగా మూతిపెట్టి అరిచి చెబ్తోన్నాడు ఆమిషనులు నడిచేవిధానం, వాటి కరీదు, వాటిని తయారుచేసిన కంపెనీ మొదలైనవి. అతని జేబులోంచి సెంటువాసన గమ్మని విసిరింది. వొహటిరెండుతడవల ఆతనిపెదిమలు ఆమెచెవికి తగిలాయి. ఆమె అంతగా అసహ్యించుకోకుండడం చూసి ఆతని గడవ ఆమెభుజంమీద ఆనింది వొహసారి.

లోపలంతా చూసి తిరిగి ట్రాలీలో యెక్కటానికి వొచ్చారు. ఎడమవేపుకి తీసికెళ్లాడు. తను ముందు, తనవెనకాల రాజ్యం, ఆవెనక పద్మమ్మ నడుస్తోన్నారు. నేలసమంగావున్న వొహకిటికీముందుగా గోపీనాథు నడిచాడు. రాజ్యం దానిముందుకి వొచ్చేవరకు అతను గిరుక్కున తిరిగి ఆమెని రెండుచేతుల్లో గట్టిగా కౌగలించుకున్నాడు అవసరానికన్నా యెక్కువసేపు. అసలువిషయ మేమిటంటే లోపల మిషనులు తిరగటంవల్ల కలిగిన గాలంతా ఆ కిటికీగుండా జువ్వున బైటికి వొస్తుంది. ఆవిషయంతెలీని కొత్తమనిషి దానిముందుకి వెడ్తే తుఫానులాగా వొకేతడవ వొచ్చేగాలికి వూపిరిబిగపట్టాడు. హ్యాటువుంటే యెగిరిపోతుంది. కాని పడిపోడంమాత్రం సాధారణం కాదు. రాజ్యంకూడా పడకపోయేదే.

తరువాత పద్మమ్మని చెయ్యిపట్టుకోతీసికెళ్లాడు. కిటికీముందుకివెళ్లటంతోటే, పడిపోతా పట్టుకోమని

అరిచింది. అతను ఆమెపడకుండా పట్టుకుంటే ఆమె ఆతన్ని గట్టిగా పట్టుకుంది తన రెండుచేతులా.

భోంచేసేఅప్పుడు కృష్ణారావుతో రాజ్యం తాము చూసిన విశేషాలన్నీ చెప్పింది. క్లబ్బువిషయం చెబ్తాం దేమోనని పద్మమ్మ పచ్చడి పట్టుకోవచ్చి సైగచేసింది. ఆ కిటికీదగ్గిరవిషయం రాజ్యమే చెప్పదలుచుకోలేదు.

3

తరువాత రెండురోజులదాకా గోపీనాథు అవుపళ్లేదు. ఆనాడు సాయంత్రం తల్లీబిడ్డలు వాళ్లింటికి దగ్గిరగావున్న పార్కులోకి వెళ్లారు. అక్కడోహ కుఱ్ఱాడిని చూసి గోపీనాథు జ్ఞాపకం వొచ్చాడు పద్మమ్మకి. ఎందుకు రావటంలేదో? అక్కడ కూచోని అతని విషయం ఆలోచిస్తోంటే, తమయింటివేపు చూస్తోంటే ఆరోడ్డునుంచి తమ యింటివేపు యెవరో వెళ్లినట్టు అవుపడ్డది. గోపీనాథుమల్లేనే వున్నాడు. చప్పున లేచి, "కడుపు నొస్తోంది, కాస్త దొడ్లోకి వెళ్లి వొస్తా, ఇక్కడే కూచో" అని రాజ్యంతో చెప్పి వెళ్లిపోయింది.

గోపీనాథు తమ యింటివేపు వెళ్లటం రాజ్యం కూడా చూసింది. ఆతన్ని చూసేచూడటంతోటే ఆమె గుండె భయంతో కొట్టుకుంది. ఈరెండురోజుల్నుంచి ఆతడు బ్లఫులో కిటికీదగ్గిర తనినిపట్టుకున్నప్పటినుంచి అతను యెన్నోసార్లు ఆమెకి జ్ఞాపకంవొచ్చాడు. అతను జ్ఞాపకంవొచ్చినప్పుడల్లా ఆమె కంపించిపోయింది. ప్రతితడవా, యీ ప్రపంచపు అవమానాన్ని భరించలేక కుంగిపోతోన్న తనస్నేహితులూ, బంధువులూ ఆమెకళ్లకు కట్టారు. ఆకుంతీదేవి జ్ఞాపకం వొచ్చింది. కాని అది మహాపుణ్యయుగంకాబట్టి కర్ణుడు ఆమెచెవులోంచి పుట్టాడుకాని మరేమీకాదని సమర్థించి ఆమెని పంచమహాపతివ్రతల్లో వొకర్తగా ప్రపంచంముందు నుంచోపెట్టి ఉత్కృష్టమైన క్షమాశక్తినీ, వుదారత్వాన్నీ బ్రహ్మత్వంగా ప్రదర్శించారు ఆశాస్త్రవేత్తలు, ఆవిప్రులు. కాని బ్రహ్మత్వమంతా తద్దినపుకూటిలో (బ్రాహ్మణార్థం) యిమిడిపోయిన యీకలియుగంలో వుదారం యెక్కడ దొరకాలి! ఎట్లాగైనా యీఆపదలోంచి తప్పించుమని దేవుడికి మొక్కింది.

రాజ్యం చప్పున లేచి అందంగాపూసిన పూలమొక్కలకేసి చూస్తో తిరుగుతోంది. నైటుక్వీను చెట్టుదగ్గిర ఆగి దానిపక్కన పూసిన 'డైశీ'ని చూస్తోంటే తనకుదగ్గిరగా యెవరో మెదిలినట్టయింది. తిరిగి చూసింది. కొంచెంగా నవ్వుతో గోపీనాథు నుంచున్నాడు. ఆమె తిరగడంతోటే, "ఏమండీ, బాగున్నారా?" అని అడిగాడు. ఆమెఆవులికిపాటులో మాట రాలేదు. కష్టంమీద "ఆ" అంది. ఇద్దరూ అక్కడినుంచి కదిలారు.

"మొదలు యింటికెళ్లా. అక్కడ మీరెవరూ లేరు. తోటకి వెళ్లారని కుఱ్ఱాడు చెబ్తే యిటొచ్చాను. అమ్మగారేరీ?"

"ఇంటికెళ్లింది. వొస్తుంది యిప్పుడే."

రాజ్యం ఆతన్ని తప్పించుకుందా మనుకుంది. గేటువేపు నడవ ఉద్యుక్తురాలైంది. గోపీనాథు ఆమె తోవకి కాస్త అడ్డంగాజరిగి, "ఏం, అమ్మగారు యిప్పుడే వొస్తారన్నారుగా? అందాకా యిక్కడ కూచుందాం". ఏమీతోచక రాజ్యం ఆగరకమీద వున్న చిన్నబెంచీలో కూచుంది ఆతనికి స్థలం లేకుండా. అతడు కింద గరకమీద ఆమెకాళ్లదగ్గిర కూచున్నాడు. చేతులోని స్ఫియరుపత్రికని కిందపడేసి ఆమెవేపు చూశాడు. ఆతను తనవేపు అట్లా చూడటం చూసి రాజ్యం పైటసరిచేసుకుంది. ఆఆక్వర్డునెస్‌ని పోగొట్టాలని అంది, "రెండురోజుల్నుంచి అవుపళ్లేదే?"

"ఏం, అవుపడకపోతే?"

పెదిమలు చప్పరిస్తో, "అమ్మ రెండుమూడు తడవల జ్ఞాపకంచేసింది."

"పనిమీద వూరికి వెళ్లి యింతకుముందే వొచ్చాను."

కొన్ని నిమిషాలు యెవరూ మాట్లాళ్లేదు. చీకటి పడ్డది కాస్త. కొంచం కొంచంగా వినపడుతోండిన పక్షులచప్పుడు పూర్తిగా నిమ్మళించింది. స్త్రీలపైటల్ని వాళ్లకి తెలీనీకుండా జరిపేసే సన్నని గాలిలో పూల కమ్మదనం హెచ్చింది. దగ్గరగావున్న మదనమస్తు చెట్టు నిండుగా పూసి అక్కడ కూచున్నవాళ్లని మదింపజేస్తూ పిచ్చెత్తిస్తోంది. గోపీనాథు చుట్టూచూసాడు. దగ్గరగా యెవరూ లేరు. తోట్లోకూడా యెవరూ లేరేమో. జేబులోంచి ఫౌంటెన్ కలము తీసి ఆపత్రికమీద యేమో రాశాడు. దాన్ని ఆమెకు అందిస్తో, "చూడండి." అన్నాడు.

రాజ్యం తీసుకుంది. పైపుటమీద అతను రాసిన అక్షరాలకేసి చూసింది.

"ఏమిటలా చూస్తారు? అది మారాజ్యం. అతను నాకు ప్రాణస్నేహితుడు." చిరునవ్వుతో ఆకర్షణీయంగా అన్నాడు గోపీనాథు.

రాజ్యం వినిపించుకోక పుటలు తిప్పేస్తోంది. మళ్లీ అన్నాడు గోపీనాథు వొక్క నిమిషంతరువాత, "రాజ్యం, రాజ్యం, ఎంతో ముద్దుపేరుగదూ రాజ్యం?"

ఆమె ఆతనివేపు చూసింది.

"ఏమంటారు, రాజ్యం చాలాముద్దుపేరేనా? మల్లెమొగ్గలాంటిదేనా?"

మళ్లీ ఆతనివేపు చూసింది రాజ్యం. ఆమెకు తెలీకుండానే ఆమెరక్తం వేడిహెచ్చింది. ఆపత్రిక పుటలు తిప్పుతో తిప్పుతో మధ్యపుట విప్పింది. దాంటోవన్నీ సినిమాబొమ్మలు. నాయికానాయకుల ఆలింగనాలూ అవీను. ఆమెవుద్రేకం ఆగిందికాదు. ఆపత్రికను కిందకు విసిరింది. ఆమెకాళ్లదగ్గిర కూచొని ఆమెముఖంవేపు నిదానించిచూస్తోన్న గోపీనాథు ఆమెకి దగ్గిరగా జరిగి ఆమెనడుంచుట్టూ చేతులువేశాడు. రెప్పపాటులో ఆమెని తనమీదికి లాక్కొని పూర్తిగా తనచేతుల్లో వశంచేసుకొని ఆవెచ్చనినోటిమీద ముద్దులు కురిపిస్తో, "రాజ్యం, నారాజ్యం" అన్నాడు వుద్రేకంగా. రాజ్యం వొద్దువొద్దుఅంటోనే ఆతనికి యిమిడిపోయింది. చేతులు ఆతనితలని వశానికి అదుపు కున్నాయి. ఆతనిముద్దులమధ్య ఆతని వుద్రేకం హెచ్చడం కనుక్కొని చప్పున ఆతనిబిగువును వొదిలించుకొని దూరంజరిగి, "వొద్దు. నాకు భయమవుతుంది."

" ఆమెకాళ్ల దగ్గిర కూచుని ఆమెముఖంవేపు నిదానించిచూస్తోన్న......"

"భయమెందుకు, యెవరున్నారని యిక్కడది?

"వొహరు చూస్తారని కాదు."

"మరి?"

మరి చెప్పలేకపోయింది. ఆడవాళ్లకి సహజమైన లజ్జాపిశాచం మాటపెకలనివ్వలేదామెకి. మళ్లీ గోపీనాథు ఆమెని బలవంతంగా తన బాహుబంధంలోకి లాక్కున్నాడు. ఆతనికి లొంగిపోగూడదని ప్రయత్నిస్తోన్న ఆమెమనసుని ఆమెలోని మనుష్యసామాన్యమైన అసహాయత్వం వోడించింది. గెలువనిచ్చిందికాదు. ప్రథమ యవ్వనంలోవున్న ఆతని వుద్రేకమైనముద్దులు, కట్టెబొమ్మని సైతం పట్టుమనిపించే ఆలింగనం అనుభవం లేని రాజ్యాన్ని పరవశురాలిని చేశాయి. ఆమె శరీరం

ఆమెఆధీనంతప్పింది. ఆమెకి తెలీకుండానే అతనికి లొంగిపోయింది. గ్రహించుకుంది.

రోడ్డులోని దీపంవెలుగు ఆతోట కాంపౌండు సీకులకి అల్లుకొనిపెరిగిన తీగలసందులోంచి గరకమీద తునకతునకలుగా పడుతోంది. వొకతునక అక్కడ పడివున్న స్ఫియరుపత్రికమీద పడ్డది. బైట రోడ్డుమీద వెడ్తోన్న వొకాయన్ని దూరంనుంచి యెవరో యెన్ని కొట్టారని అడిగారు కన్నడంలో. "ఎంటు గంటె." (ఎనిమిదిగంటలు) అన్నాడాతను.

రాజ్యం లేచింది చప్పున. గోపీనాథు కూడా లేచాడు. గేటుదగ్గిరకి వెళ్లారు. రాజ్యం గోపీనాథు వేపు చూడసైతం చూడకుండా ముఖం కిందికి వాల్చుకొని సరాసరి యింటివేపు నడిచివెళ్లింది.

రాజ్యం యింటికి వెళ్లేవరకు కృష్ణారావు క్లబ్బునుంచి రాలేదు. పద్మమ్మ వంటచేస్తోంది. రాజ్యం అడుగులచప్పుడు వినబడటంతోటే గిరుక్కున వెనక్కితిరిగిచూసింది. "ఇంతసేపేంచేశావు రాజ్యం?" అని అడిగింది.

"నువ్వొస్తావని యెదిరిచూస్తో గరకమీద పడుకుంటే నిద్రపట్టిందాలాగే. నువ్వురాలేదెందుకమ్మా?"

పద్మ కాస్త వెలవెలబోయింది. కాని అప్పటి స్థితిలో రాజ్యానికి అవేవీ అవుపళ్లేదు.

"గోపీనాథు వొచ్చాడా తోట్లోకి?"

"రాలేదే."

"మనకుఱ్ఱాడితో చెప్పాడట తోట్లోకి వెడ్తానని."

"ఏమో. నాకుమాత్రం అనుపళ్లేదు."

౪

గోపీనాథు, అతన్ని యెంతో గార్వంగా చూసే మేనమామ హైదరాబాదలో చచ్చేస్థితిలో వున్నాడని టెలిగ్రాంవొస్తే వెళ్లాడు. నెలరోజు లుండి ఆయన అంత్యక్రియలన్నీ ఆసాంతం కానిచ్చి తిరిగి వొచ్చాడు. వొచ్చి అన్నంతినడమే తడవు కృష్ణారావుగారి యింటికి వొచ్చాడు. పద్మమ్మ అప్పుడే భోంచేసి వసారాలో యెండపొలుపుకి కూచుంది. గోపీనాథుని చూడటంతోటే పట్టలేని ఆనందంతో ముందుకి వొచ్చింది కౌగలించుకుంటుందేమో అన్నట్టు. కాని ఆమె పుణ్యం. రాజ్యం యెక్కడ అని అడిగాడు. 'జ్వరంతగులుకుంది వారంరోజుల్నుంచి. గదిలో పడుకుం' దని చెప్పింది. లోపలికెళ్లారు. మంచంమీద బ్లాంకెటు కప్పుకొని పడుకుంది. పద్మమ్మదగ్గిరకెళ్లి, "అమ్మాయీ, గోపీనాథు వొచ్చాడు." అంది. చప్పున ముఖంమీది కప్పు తీసింది రాజ్యం. గోపీనాథు హృదయం కొట్టుకుంది. ఎంత చిక్కిపోయింది వారంరోజులకే! రాజ్యంకళ్లల్లో నీళ్లు నిండాయి. చప్పున ముఖంమీది బ్లాంకెటుతో తుడుచుకుంది. గోపీనాథుపద్మమ్మవేపై, "యీవారం రోజుల జ్వరానికే క్షయరోగిలా అయిందేమిటండీ?" అని అడిగాడు దిగులుగా. "అసలు నువ్వువెళ్లినప్పటినుంచే ఎండిపోవడం ఆరంభించింది. అన్నంపోదు. ఏదీ రుచించదు నోటికి. ప్రతిదీ అసహ్యించుకుంటుంది. ఎప్పుడూ దిగులుగా వుంటుంది. మా కేమీ తోచలేదు. డాక్టరు పరీక్షించాడుకాని యేమీచెప్పలేదు. వారం రోజుల్నుంచి రోజూ మధ్యాహ్నం జ్వరం. నిన్న సోదిఅడిగా తొక్కుడుదాటుడేదో అయివుండాలని. నేననుకున్నట్టే తేలింది. అదేదో రేపుగురువారంనాడు చేసిచూడాలి."

పోస్టువాడొచ్చాడు. పద్మమ్మ వెళ్లింది. గోపీనాథు రాజ్యంవేపు చూశాడు. మంచంమీద కూచోమంది. చేతితో లాక్కుంది. అతని ముఖాన్ని తనముఖానికి దగ్గిరగా పట్టుకొని, "కొండకెదిరిచూసినట్టు చూస్తోన్నా నీరాకకోసం. నీతో మాట్లాడాల్సి వుంది." మిక్కిలికష్టంగా, "భయపడ్డదే ముందుకొచ్చింది," అని ముగించింది. నీళ్లు ప్రవాహంలా దూకాయి కళ్లలోంచి. పద్మమ్మఅడుగులచప్పుడు వినపడ్డది. గోపీనాథులేచి ఆవేపు వెళ్లాడు. వాళ్లిద్దరూ వసారాలోకి వెళ్లారు.

రాజ్యంవిషయం గోపీనాథుకేమీ అర్థంకాలేదు. ఆరోజంతా అదేవిషయం ఆలోచించాడు. సాయంత్రం మళ్లీ వాళ్లింటికెళ్లాడు. వాళ్లు కాఫీతాగుతో కూచున్నారు. ఈతను వెళ్లటంతోటే దాంట్లోంచి వుంకోకప్పుకాఫీ సగపెట్టారు ఆతను వొద్దంటేకూడ. కాఫీతాగినంతసేపూ ఆలోచించాడు గోపీనాథు పద్మమ్మలేకుండా రాజ్యంతో మాట్లాట్టం యెట్లాగని. ఏమీ తోచలేదు. రాజ్యం అంది, "విసుగొస్తోందమ్మా వూరికే యింట్లోకూచోని. అలా నదివేపు కాస్తవెళ్తే బాగుంటుంది."

గోపీనాథుకి వొకఆలోచన స్ఫురించింది. అన్నాడు, "అవును మెల్లిగా అలావెళ్లండి. ఆనదివేపు గాలికూడా శుభ్రంగా వీస్తుంది."

"ఏం, నీకేమైనా పనుందా?" పద్మమ్మ విచారించింది.

"పనేం అట్టేలేదు కాని, రెండురాత్రుల్నుంచి బొత్తిగా నిద్రలేకపోవడంచేత కులాసాగాలేదు. మీరుకూడా వుండండేం, హైదరాబాద విషయాలుచెబ్తాను. ఆమెని కుఱ్ఱాడితో వెళ్లనివ్వండి."

దిగులుగా చూస్తోన్న రాజ్యానికి సైగచేశాడు పద్మమ్మచూడకుండా.

"అవును. కుఱ్ఱాడివెంబడి వెళ్లిరా అమ్మాయి."

రాజ్యం లేచి మెల్లిగా కుఱ్ఱాడితో వెళ్లింది.

"ఎన్నాళ్లయింది గోపీనాథూ నువ్వు హైదరాబాదవెళ్లి?"

"దాదాపు నెలకిపైగా అయివుంటుంది."

"ముప్పైరోజులు కదూ!" రెండు రెట్టలూ పైకెత్తి సిగ సవరించింది తనవక్షపు పొంకం ఆతని దృష్టికి ఆనాలన్నట్టు.

గోపీనాథు లేచాడు. "మరిచాను. ఇప్పుడే వొస్తాను. వొక్క నిమిషం."

"ఏమిటాపని?"

"కూర్చోండి. ఇప్పుడే వొస్తాను." గేటుబైటి నుంచి చెప్పి తమయింటివేపు పరుగెత్తుకోవెళ్లాడు.

గోపీనాథు వుంకోదారిని వెళ్లేవరకు రాజ్యం, ఆకుఱ్ఱాడు అట్టేదూరం వెళ్లలేదు. రాజ్యం మాటిమాటికి వెనక్కి తిరిగిచూస్తో మెల్లిగా నడుస్తోంది. గోపీనాథు అగుపడటంతోటే ఆగిపోయింది. నుంచోలేక దగ్గరగావున్న వొకరాతిమీద కూలబడ్డది. అతను దగ్గరకిరావటంతోటే ఆతనివొళ్లో పడి భోరుమని యేడ్వటం ఆరంభించింది. అతడు ఆకుఱ్ఱాడిని దగ్గరకి పిలిచి జేబులోంచి కొన్నిడబ్బులు తీసియిచ్చి, యింటికి వొస్తే కొటేస్తానన్నాడు. ఇంకా యేమేమోఅన్నాడు కన్నడంలో. ఆవుని తోలుకోరమ్మని పంపా డాతన్ని.

"ఏమిటిరాజ్యం, యెందుకీయేడ్వటం?"

ఆమె ఆతనివక్షంలో తలదాచుకొని అతని హృదయానికే తెలియాలన్నట్టు "మంచిమందేమైనా తెలుసా నీకు, నమ్మకమైంది?"

"ఇంతమాత్రానికి యేడ్వటమెందుకు రాజ్యం? ఈమలేరీయాజ్వరానికి యింతదిగులా?"

"జ్వరంకోసం కాదు." మళ్లీ వెక్కి వెక్కి యేడ్వటం ఆరంభించింది. ఏడుస్తోనే వొక్కొక్క మాట అంది, "మొదట్నుంచీ నాకిదే భయం, అందుకనే మొత్తుకున్నా. మొగాళ్లంటేనే అమితమైనభయం నాకు. వాళ్లనీడ వాల్తేకూడా యేమవుతుందోనని అనుమానం." తల పైకెత్తి ఆతనిముఖంవేపు చూసింది. ఇంకా ఆతనికి తెలిసినట్టులేదు. ఆతనివేపు చూస్తో యెడమచేత్తో కడుపుమీద కొట్టుకొని మెడకి వేలాడబడి భోరుమన్నది.

గోపీనాథు కొయ్యబారిపోయాడు. అప్పుడాతనికి అర్థమైంది. పిడుగు మీదపడ్డట్టు అయింది. నడ్లు తెరిచాడు.

అయిదు నిమిషాలదాకా యెవరికీ వొళ్లు తెలీలేదు. చివరకి రాజ్యం అంది "ఇన్ని యింగ్లీషుపుస్త

కాలు చదువుతావు, వాటిలో లేదూ యేదైనా గట్టి మందు?"

"ఇట్లాంటివి వాటిలో వుండవు రాజ్యం. ప్రభుత్వం అనుమతించదు."

"ఎవరైనా మంచిడాక్టరు తెలుసా పోనీ, కనికరం కలవాడు, నమ్మదగినవాడు?"

"ఇక్కడ వున్నదల్లా వొహ డాక్టరే. ఆయన పూర్వాచారఛాందసుడు."

నిరాశతో యేడ్చే గొంతుకతో, "స్నేహితులెవరైనా?"

ఆతను మాట్లాడకుండా ఆమెని దగ్గిరకి తీసుకున్నాడు. ఆ నెత్తిని భుజంమీద ఆనించుకొని వోదార్చాడు. ఆతనికళ్లలోంచికూడా నీటిచుక్కలు రాలాయి. ఆమెచెవికి దగ్గిరగా ముఖంపెట్టి, "భయపడకు రాజ్యం. ఎక్కడికైనా లేచిపోదాం. స్వాతంత్ర్యంగా, నిర్భయంగా బతుకుదాం."

"ఎందుకు? అక్కడమాత్రం అపవాద తప్పుతుందా? ఏమారుమూలకి వెళ్లినా, యేకారుచీకట్లో దాగినా వెతికిపట్టి వేలుచూపుతుంది ప్రపంచం. నాన్న అమ్మని బంధువుల్ని బతికుండగానే చంపుకుని నా అనేవాళ్లు లేక యేంసుఖం? వొద్దన్నా. వొద్దని మొత్తుకున్నా." మళ్లీ ఆతనిమెడకి పడియేడ్చింది.

ఘడినిమిషాలదాకా యెవరూ మాట్లాడ్లేదు. చీకటిపడ్డది. రాజ్యం యేడ్పుమానింది. ధైర్యంగా నిశ్చయంతో లేచింది.

"చీకటిపడ్డది వెడ్దాంపద."

గోపీనాథుకూడా లేచాడు, "మరి యేంనిశ్చయించావు రాజ్యం?"

"భయంలేదు లే. ఏమీకాదు."

ఆశ్చర్యంగా ఆమెముఖానికేసి చూశాడు. రాజ్యం చిరునవ్వుతో ఆతనిచెంపల్ని పట్టుకొని పెదిమల్ని ముద్దుపెట్టుకుంది. "ఏమి టట్లాచూస్తావు? భయపడకు. నాది వొట్టిభయం."

"అమ్మతో చెప్పకూడదు?"

"చూద్దాంలే."

భోజనా లయింతరువాత యేమైనాకాని పద్మమ్మతో చెప్పాలనుకుంది రాజ్యం. కాని ఆమె కృష్ణారావుతో మాట్లాడుతూ కూచుంది. ఎంతో రాత్రిదాకా కాచుకోవుంది పీలు చిక్కుతుందేమో నని. రాజ్యం నిద్రపోయిందనుకొని వాళ్లిద్దరూ తమగదిలోకి వెళ్లి తలుపేసుకున్నారు.

హాల్లోని గడియారం కొట్టినప్పుడల్లా గంటలు లెక్కపెట్టింది రాజ్యం. మెల్లగా మంచంలోంచి లేచి కిటికీదగ్గిర కెళ్లింది. కిటికీ అద్దంలోంచి బైట వెన్నెల పిండారపోసినట్టు అనుపడ్డది. తలుపు కాస్త తెరిచింది. చల్లనిగాలి లోపలికి విసిరింది. మంచంమీది బ్లాంకెటుని ముసుగుపెట్టుకొని బైటికివెళ్లి చప్పుడుకాకుండా తలుపు మూసింది మళ్లీ.

ఎంతసేపు నడిచినా దారితరగదు. ఆ వొక్క ఫర్లాంగుదూరమే యెన్నో మైళ్లలా గనిపించింది. ఆ జలపాతానికి యెదురుగా హాయిగా కూచొని పాతాన్ని నిమ్మళంగా చూట్టానికి వేసిన అరుగుమీద అలిసిపోయి కూలబడ్డది రాజ్యం. ఆ యెత్తుమీదినుంచి గంభీరంగా దూకే ప్రవాహంవేపు చూసింది. అది ప్రపంచంలో వుండికూడా ప్రపంచంతో తనకేమీ సంబంధం లేనట్టు దూకుతోంది తెల్లని వెన్నెల్లో. అది యెంతకాలంనుంచి అట్లా ప్రవహిస్తోందో, యింకా యెంతకాలం ప్రవహిస్తుందో! ఎందరు యెన్నిభావాల్తో దాని దగ్గిరకి వొచ్చారో! ఆమహాప్రవాహాన్ని యెంద రెన్ని విధాల భావించారో!

రాజ్యం చప్పున లేచి కిందికి ప్రవాహందగ్గిరకి పరుగెత్తింది. అంతయెత్తుపైనుంచి ప్రవాహం దూకటంచేత పొగలాగా పైకిలేస్తోన్న ఆతుంపురులోకి బ్లాంకెటు విసిరింది. అది వొక్కసారి గిర్రున తిరిగి మాయమైంది. ఎంతచూసినా అవుపళ్లేదు.

రాజ్యం ఆదూకుడుకి దగ్గరగావున్న గుండు మీదికి యెక్కింది. బ్లాంకెటు మాయమైన తావును నిదానించిచూసింది. చెయ్యిపెడితే యీడ్చుకోపోయే అంతచల్లని కావేరీప్రవాహంలో తన వెచ్చని నిండు ప్రాణాన్ని విసిరింది. వొక్కనిమిషంలో రాజ్యం అదృశ్యమైంది. ఆమెవునికే ప్రపంచంలో స్వప్నమైంది. అయినా తనేమీ యెరుగనట్టు శాంతంగా అమాయకంగా ప్రవహిస్తోనేవుంది కావేరి.

తెల్లారి రాజ్యంకోసం వూరంతా వెతికారు. కృష్ణారావుయింటిపక్కనే వుండే అకౌంటెంటు యొక్క ఫ్యూన్ ఇస్మాయిల్ రెండువేలరొక్కంతో పలాయనమైనాడని రిపోర్టువచ్చింది. అతనే రాజ్యాన్ని కూడా లేవతీసుకొని హైదరాబాద వెళ్లిపోయినాడని పుకారు.



సింహాచలము దేవాలయము, లోవైపు K. S.